ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 06.07.2024 సమయం: 1.10గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి , చంద్రబాబు నాయుడు ఈ సాయంత్రం హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో సమావేశమవుతున్నారు.
2. ఒడిషాలోని నైనీ బొగ్గు గనులకు సంబంధించి 643 హెక్టార్ల అటవీ భూములను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కి అప్పగించేందుకు అనుమతులు లభించాయి.
3. ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల కొండపై సనాతన ధర్మానికి విఘాతం కలగకుండా చర్యలు చేపడుతూ, భక్తుల సౌకర్యాలను , ప్రతిష్టను పెంచేందుకు వెంటనే కార్యాచరణ అమలుచేయాలని భారతీయ జనతా పార్టీ, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.
4. ఆషాఢమాసం బోనాలు రేపు ప్రారంభం కానున్నాయి. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో రేపు తొలి బోనంతో ప్రారంభమై ... నెల రోజుల పాటు హైదరాబాద్ వ్యాప్తంగా ఈ వేడుకలు జరుగుతాయి.

**MINISTERS MEETING :** తెలంగాణ- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక సమావేశం ఈ రోజు సాయంత్రం జరుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్ లో సమావేశం కానున్నారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లోని షెడ్యూలు -9, షెడ్యూలు - 10 ల్లోని పలు అంశాలతో పాటు ఉభయ రాష్ట్రాల మధ్య గోదావరి , కృష్ణానది జలాల పంపకం వంటి ప్రధాన సమస్యకు ఈ సందర్భంగా చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల నుంచి సంబంధిత శాఖల మంత్రులు, అధికారులు కూడా పాల్గొంటున్న నేపథ్యంలో ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కూడా లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా , ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి సమస్యల పరిష్కారానికి

సమావేశం కావడం పట్ల సిపిఐ సీనియర్ నాయకడు కె. నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇదొక శుభపరిణామని ఆయన వాఖ్యానించారు. **(DESK)**

**SINGARENI COAL MINE :** ఒడిషాలోని నైనీ బొగ్గు గనులకు సంబంధించి 643 హెక్టార్ల అటవీ భూములను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ( SCCL) కి అప్పగించేందుకు అనుమతులు లభించాయి. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కోసం ప్రత్యేకంగా బొగ్గును తవ్వుకునేందుకు ఆ సంస్థకు మార్గం సుగమం అయింది. ఏటా కోటి టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న నైనీ బొగ్గు గనిని 2015 లోనే సింగరేణి కి కేటాయించినా, పలు కారణాలతో గనుల అప్పగింత ఆలస్యం అయింది. కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రిగా జి. కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత , ఒడిషా ప్రభుత్వంతో విస్తృత చర్చలు జరిపారనీ , ఫలితంగా 643 హెక్టార్ల అటవీ భూములను సింగరేణికి అప్పగించేందుకు అనుమతులు లభించాయని సింగరేణి తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. దీనిపై కిషన్ రెడ్డి స్పందిస్తూ కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నైని బ్లాక్‌కు సంబంధించి ఒడిశా ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. **(MSL)**

**BJP-TIRUMALA:** ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల కొండపై సనాతన ధర్మానికి విఘాతం కలగకుండా చర్యలు చేపడుతూ, భక్తుల సౌకర్యాలను, ప్రతిష్టను పెంచేందుకు వెంటనే కార్యాచరణ అమలుచేయాలనీ BJP ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. BJP OBC మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఒక లేఖ రాశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండు చేశారు. దాదాపు 20 అంశాలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగం , హుండీ ఆదాయంపై విచారణ జరిపి టీటీడీని ప్రక్షాళన చేయాలన్నారు. **(MSL)**

**CM – JOBS :** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని , నిరుద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి హైదరాబాద్ లోని తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కొన్ని రాజకీయ పార్టీల కుట్రలకు నిరుద్యోగులు బలి కావద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో ఇష్టారీతిన

నిబంధనలు మారిస్తే, తలెత్తే చట్ట పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలాగా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నిరుద్యోగులకు న్యాయం జరగకపోగా.. ప్రస్తుతం ఉన్న నోటిఫికేషన్లు కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం తమ ప్రభుత్వం ఇప్పటికే 28 వేల 942 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. **(MSL)**

**NALGONDA-JALSAKTI ABHIYAN :** నల్గొండ జిల్లాలో జలశక్తి అభియాన్ పనుల పట్ల కేంద్ర జల శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ పేద వీర్ ఆర్య సంతృప్తి వ్యక్తం చేశారు. శాస్త్రవేత్త దివాకర్ మహంతా , కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి జిల్లాలో అమలు చేస్తున్న జలశక్తి అభియాన్ పనుల పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా జల శక్తి అభియాన్ పథకం కింద నల్గొండ జిల్లాలో చేపట్టిన పనులను కలెక్టర్ కేంద్ర బృందానికి వివరించారు. ఈ బృందం ఈ రోజు దేవరకొండ డివిజన్లో పర్యటించి డిసిల్టింగ్ ,అమృధ్ సరోవర్, ఫిష్ పాండ్ ల ను బృహత్ పల్లె ప్రకృతి వనాలను పరిశీలించింది. **(PTC)**

**GHMC :** జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన చేపట్టారు. ఈ ఉదయం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం మొదలైన కాసేపటికే , మేయర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు , ఎమ్మెల్యేలు పోడియం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీయే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందని పేర్కొన్నారు. నిరసన నేపథ్యంలో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. **(DESK)**

**SAMPOORNATHA ABHIYAN :** మహిళల ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై దృష్టి సారిస్తూ కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా అమలు చేస్తున్న సంపూర్ణత అభియాన్ పథకాన్ని నిర్మల్ జిల్లా పెంబి మండలంలో ఈ రోజు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ర్యాలీ గా వేదిక వద్దకు కలెక్టర్ ను తీసుకువెళ్లారు. **(PTC)**

**ZOONOSIS DAY :** జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ అన్నారు. ఈ రోజు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెంపుడు జంతువులకు యాంటి రాబిస్ టీకా వేయడం

ద్వారా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. జూనోసిస్ డే సందర్భంగా ఈ రోజు పశు వైద్య కేంద్రాల్లో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని రవీందర్ చెప్పారు. **(PTC)**

**ZOONOSIS JAGITYALA :** ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యం లో పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల తీసికోవాల్సిన జాగ్రత్తలు ,పెంపుడు జంతువుల పోషణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా ఆంటి రేబిస్ టీకాలు (ARV) వేశారు. **(PTC)**

**GOLKONDA BONALU :** హైదరాబాద్ ఆషాఢమాసం బోనాలు రేపు ప్రారంభం కానున్నాయి. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో రేపు తొలి బోనంతో ప్రారంభమై నెల రోజుల పాటు హైదరాబాద్ వ్యాప్తంగా ఈ వేడుకలు జరుగుతాయి. ఈ నెల 14న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, 21న లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. తిరిగి గోల్కొండ కోటలో బోనాల సమర్పణతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. కాగా , రేపు జరిగే బోనాల జాతర కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బోనాలకు వచ్చే భక్తుల కోసం జలమండలి గోల్కొండ కోటతో పాటు , జాతర జరిగే మార్గంలో పలుచోట్ల తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేసింది. గోల్కొండకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాగా , కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గోల్కొండ కోటలో బోనాల జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. **(DESK)**

**NIMS DOCTOR SUICIDE :** హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో అనస్తీషియా శాఖలో పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ ప్రాచీకర్ ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ బేగంపేటలోని ఆమె నివాసంలో అధిక మోతాదులో మత్తుమందు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయింది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. **(DESK)**

**GOURAV RAIL :** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ నెల 9న మరో భారత్ గౌరవ్ పర్యాటక రైలు ప్రారంభం కానుంది. అయోధ్య , కాశీ, గయా, ప్రయాగ్ రాజ్ తదితర పుణ్యక్షేత్రాలను కలిపేలా ఈ రైలు

నడుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్ , కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి , సామర్లకోట, పెందర్తి, విజయనగరం స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కవచ్చు. ఈ రైలులో స్లీపర్ టికెట్ ధర 15 వేల 510 రూపాయిలుగా నిర్ణయించారు. **(PN)**

**CONSUMERS-WHATSAPP :** వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ఉత్పత్తులపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వాట్సాప్ ఫీచర్ ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ లో 88 00 00 19 15 నెంబర్ కి హాయ్ అని మసేజ్ పెట్టాలి. అక్కడ చూపించే ఆప్షన్ల ఆధారంగా వివరాలు అందజేస్తే... ఫిర్యాదు నమోదవుతుంది. **(DESK)**

**SIRICILLA-SP :** పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందికి సూచించారు. నిన్న సాయంత్రం జిల్లాలోని బోయినపల్లి పోలీస్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదులపై జాప్యం చేయకుండా అధ్యయనం చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చురుగ్గా సమస్యల్ని పరిష్కరించాలని పోలీసులకు సూచించారు. **(PTC)**

**SADARAM RAJANNA :**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకునేలా మార్పులు చేశారని , రాజన్న సిరిసిల్ల జిల్లా డీఆర్డీవో శేషాద్రి తెలిపారు. దివ్యాంగులు ఎప్పు డైనా దగ్గరలోని మీసేవ కేంద్రం నుంచి స్లాట్ బుక్ చేసుకోవచ్చని చెప్పారు. **(PTC)**

**WEATHER UPDATE :** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారుతున్నాయని, దీంతో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 5 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా గంటకు 40 కిలోమీటర్ల వరకు స్థిరమైన ఉపరితల గాలులు వీస్తాయని, ఈ ప్రభావంతో ఎల్లుండి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. **(PN)**